జ్యోతిబాపూలేకు నివాళి

ముధోల్/నిర్మల్‌టౌన్/భైంసారూరల్/సారంగపూర్/కడెం/తానూరు/భైంసాటౌన్/ఖానాపూర్: ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముధోల్‌లో జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆవిష్కరించారు. ఈ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిబాపూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్‌ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏంబడి చంద్రశేఖర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జంగం రవీన్, గంగాధర నవీన్, ఏఎంసీ చైర్మన్ భూమన్న, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డి, భారతీయ బౌద్ధమహాసభ నాయకులు, డిపో మేనేజర్ పండరి, ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో పూలమాల వేసి జయంతిని నిర్వహించారు.


ముధోల్‌లో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


తానూరులో..నాయకులు


నివాళులర్పిస్తున్న డిపో మేనేజర్ పండరి


ఖానాపూర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


భైంసారూరల్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు


సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలో..

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్


విద్యార్థినుల నృత్యం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి చదువుకుని చాలామంది ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. కళాశాలలో విద్యార్థులు మంచి క్రమశిక్షణతో పెరిగితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ కళా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో కళాశాల విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారని కితాబిచ్చారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ మేకింగ్, జిజ్ఞాస, క్రికెట్, వాలీబాల్, చెస్, రన్నింగ్ తదితర క్రీడల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, అధ్యాపకులు నాగ శ్రీనివాస్, రంజిత్ కుమార్, శంకర్, రంజిత్, కుమార్, జాకీర్ హుస్సేన్, సూర్యసాగర్ పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లను ఆపి, మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని శుక్రవారం నిర్మల్ టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఏర్పాటుచేసిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్‌లో తీర్మానం చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతుంటే మావోయిస్టు అనే ముద్రవేసి కేంద్ర బలగాలు చంపేస్తున్నాయన్నారు. ×ఆపరేషన్ కగార్× పేరుతో ఎన్ కౌంటర్‌లు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్ట్ పార్టీ శాంతిని నెలకొల్పడానికి జడ్చర్లకు ముందుకు రావడం శుభ పరిణామన్నారు. ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలకు వచ్చి రాజ్యాంగ హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎన్ రెడ్డి, దుర్గం నూతన్ కుమార్, జె రాజు, కె.రాజన్న, రాంలక్ష్మణ్, అల్లి, గోవరాక్, గులాం దుర్రానీ, పోశెట్టి, రఘోత్తమరెడ్డి, అజయ్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు పాల్గొన్నారు.

దాగాంలో పల్లకి ఉరేగింపు

తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత లభిస్తోందని హరిభక్త పారాయణం గంగాధర్ మహారాజ్ సూచించారు. మండలంలోని దాగాంలోని హనుమాన్ ఆలయ ప్రాగణంలో వారం నుంచి కొనసాగుతున్న ఆఖండ హరినామ సప్తాహం జ్ఞానేశ్వరి పారాయణం ముగింపు, పల్లకి ఉరేగింపు శోభయాత్ర ర్యాలీలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ యాత్రలో మహిళలు మంగళహారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. చిన్నారులు విఠల, రుక్మాయి వేషధారణతో ఆకట్టుకున్నారు.

రక్తదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ధన్వంతరి బ్లడ్ బ్యాంకులో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు చెందిన పలువురు ఉద్యోగులు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సుమారు 20 మంది పైగా రక్తదానంలో పాల్గొన్నారు. రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, ఎస్ఎంవో అభినవ్‌రెడ్డి, వడ్యాల్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

దస్తురాబాద్: బీజేపీతోనే గ్రామలు అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీష్‌రాథోడ్ అన్నారు. మండలంలోని రేవోజీపేటలో శుక్రవారం గావ్ ఛలో..బస్తీ ఛలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నిధులతో ప్రతీ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలోని ఉపాధి కూలీలతో పనిచేసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఒకే దేశం..ఒకే ఎన్నిక ఆవశ్యకతను వివరించారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. పార్టీ తెలంగాణ సంఘటన పర్వ్‌లో బాగంగా సంఘటన సంరచనా ప్రభారిల జిల్లా వర్క్‌షాప్ శుక్రవారం జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు రావుల రాంనాథ్, నగర్ నారాయణరెడ్డి, సత్యనారాయణగౌడ్, పడిపెల్లి గంగాధర్, నల్లా రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు, సంరచనా ప్రభారీలు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

కుంటాల: కరోనా సమయంలో పేదలకు గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా బియ్యం పంపిణీ చేశామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో శుక్రవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు 5 కేజీల బియ్యం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 1 కేజీ ఇస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం తమ ప్రభుత్వమే పంపిణీ చేస్తోందని గొప్పలు చెప్పుకోవడం ప్రజలు గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరం ఏకమై పనిచేద్దాం

- ఎమ్మెల్యే రామారావుపటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరావుపటేల్

ముధోల్: నియోజకవర్గ అభివృద్ధికి అందరం ఏకమై పనిచేద్దామని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే అందరూ కలిసి పని చేయాలన్నారు. తన హయాంలో అభివృద్ధి జరిగితే తనకు మంచి పేరు వస్తుందని కొందరు కావాలని అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ కావడంతో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందడం లేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్, ముధోల్ తహసీల్దార్ లింగమూర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు మోహన్‌రెడ్డి, తాటివార్ రమేశ్, శ్రీనివాస్, సతీశ్‌రెడ్డి, రాజేందర్, దేవోజీ భూమేష్, సంతోశ్, జీవన్, శివాజీపటేల్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!



నిర్మల్‌ఖిల్లా: పది కాదు ఇరవై కాదు ఏకంగా 50 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. అప్పటి పూర్వ విద్యార్థులందరూ ఓసారి కలుసుకోవాలనుకున్నారు. అర్థ శతాబ్దం కిందట 1976లో నిజామాబాద్ జిల్లా దూద్‌గాంలో గల సీఎస్ఐ మిషనరీ పాఠశాలలో చదువుకున్నప్పటి విద్యార్థులందరూ శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలోని సిర్గాపూర్ వద్ద గల వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయిలను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కి చెందిన వారిలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందారు. తమ బ్యాచ్ మిత్రుల్లో పేదవారికి అదేవిధంగా తాము చదివిన పాఠశాల ప్రగతి కోసం ఆర్థికచేయూత అందించాలని నిర్ణయించారు. సూర్యం, రమాదేవి, స్వర్ణ, రాజేశ్వర్, తార, బెన్నీ, సారథి ఉన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్ర

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

సోన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శుక్రవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్, గాంధీ, చాకలి ఐలమ్మ విగ్రహాలకు నివాళులర్పించారు. గ్రామంలో రాజ్యాంగ పీఠికతో ప్రదర్శన జరిపారు. అనంతరం సోన్ గ్రామానికి చెందిన తోకల సుగుణ–అశోక్ ఇంట్లో నాయకులతో కలిసి సన్న బియ్యంతో భోజనం చేశారు. మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కృష్ణవేణి రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ఓడ్నాల రాజేశ్వర్, కుంట వేణుగోపాల్, అంబేకర్ ప్రసాద్, మొయినొద్దీన్, గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గాజుల రవికుమార్, రాజనరసింహరెడ్డి, అబూద్, కాంతయ్య, గడ్డం నర్సారెడ్డి, స్వామి, అమృత్, లింగన్న ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, మొహళ, నగర్‌తండా గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, నాయకులు నారాయణ్‌రెడ్డి, నర్సారెడ్డి, సాయారెడ్డి, సతీశ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌గౌడ్, దిమేరి సాయారెడ్డి, నాగన్న, భూమన్న, బోగ్గుట నర్సయ్య, హర్షప్రసాద్, ఎల్లన్న, లోలం నర్సయ్య ఉన్నారు.

రజతోత్సవ సభ జయప్రదం చేయాలి

భైంసాటౌన్: వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, పి.రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని, రాష్ట్రప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ పాలననే కోరుకుంటున్నారన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

లోకేశ్వరం: రజోత్సవ సభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ కోరారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవనంలో మండల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు సైనికులా పని చేయాలన్నారు. నాయకులు శ్యాంసుందర్, సాగర్, దిగంబర్, ప్రశాంత్, గణేశ్, ప్రకాశ్, గంగాధర్, అనిల్, సుధాకర్, భోజారెడ్డి, ఆనంద్‌రావు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

కడెం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు పంచామృతా అభిషేకం, హోమం, హారతి ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నదానానికి కూరగాయాలు ఉచితంగా అందజేసి మత సామరస్యాన్ని చాటిన మండల కేంద్రానికి ఖాజాను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో శ్రీ గండి రాజరాజేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పండితులు హరిశ్‌కుమార్‌చారి వైదిక బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, నాయకులు వేర్వేరుగా హాజరై పూజలు చేశారు.

ఉపాధి పనులకు వెళ్లాలి

తానూరు: కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లాలని ఈజీఎస్ ఏపీవో శివలిగం సూచించారు. మండలంలోని వడ్గాం గ్రామంలో ఉపాధి కూలీతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పెంచుతున్న నర్సరీని ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలన

నర్సాపూర్ (జి): మండలంలోని నందన్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జెడ్పీ సీఈఓ గోవింద్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్ ఉన్నారు.

సంక్షిప్తంగా

13న మున్నూరుకాపుల సదస్సు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 13 ఆదివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఉదయం 11 గంటలకు మున్నరుకాపు ప్రతినిధుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల అశోక్ తెలిపారు. ఈ సదస్సుకు పార్టీలకతీ తంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులు హాజరవుతారని తెలిపారు. మే నెలలో లక్ష మందితో నిర్వహించే మున్నూరుకాపు మహా గర్జన సభ పోస్టర్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు జిల్లాలోని జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, కులసంఘ బాధ్యులు, కవులు, కళాకారులు, రచయితలు హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని నగర్ పంచాయతీ ఆవరణలో చలివేంద్రాన్ని ఎంపీడీవో వెంకటరమేశ్ శుక్రవారం ప్రారంభించారు.

నర్సరీ పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి నర్సరీని ఎంపీడీవో రాధ శుక్రవారం పరిశీలించారు. మొక్కలకు రెండు పూటలు నీళ్లు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రాచాపూర్‌లో ఉపాధిహామి పథకం పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహాదేవుని జెండాల ప్రతిష్టాపన

కుంటాల: హనుమాన్ జయంతి, మహాదేవుని పౌర్ణిమ పురస్కరించుకుని శుక్రవారం రాత్రి కుంటాల మహాదేవుని ఆలయం వద్ద జెండాలే ప్రతిష్టించనున్నారు. శనివారం రాత్రి బండరాయి ఎత్తే పోటీలు, అనంతరం జెండాలను డప్పు వాయిద్యాలతో ఊరేగించనున్ననట్లు అర్చకుడు మధు తెలిపారు.

హనుమాన్ స్వాముల పాదయాత్ర

దస్తురాబాద్: కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని దేవునిగూడెం,భూత్కూర్ గ్రామాలకు కేంద్రానికి చెందిన హనుమాన్ భక్తులు, స్వాములతో కలిసి శుక్రవారం పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. గ్రామస్తులు, హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ముస్తాబు

కుంటాల: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు. కుంటాలలో శనివారం ఉదయం రామాంజనేయుల చిత్రపటాన్ని ఊరేగించనున్నారు. జయంతి వేడుకలను విజయవంతం చేయాలని గురుస్వాములు భుజంగం గణపతి, ఏముల నరేశ్ కోరారు.

నవబ్‌పేట్‌లో పోషణ్ పక్వాడ

కడెం: మండలంలోని నవబ్‌పేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్ సత్యవ్వ అవగాహన కల్పించారు.


రాజీవ్ యువవికాసం సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: రాజీవ్ యువవికాసం పథకాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సునీత కోరారు. మండలంలోని గోసంపల్లె, కొత్తపేట్, గోడలంపల్లి, బావాపూర్(కె), దిలావర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

మానవత్వం చాటిన పీఏసీఎస్ డైరెక్టర్

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి చిరిగిన దుస్తువులతో రోడ్డుపై తిరుగుతున్నాడు. పలువురు గమనించిన సుర్జాపూర్ వాసి ఖానాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ బిక్కి చిన్నరాజన్న మానవత్వాన్ని చాటాడు. సదరు వ్యక్తికి స్నానం చేయించి నూతన దుస్తులు ధరింపజేశాడు. ఈ సందర్భంగా చిన్న రాజన్నను పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


వెంకటస్వామి


రాజశేఖర్

ఖానాపూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత నూతన అధ్యక్షుడిగా సాదుల వెంకటస్వామి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల రాజశేఖర్, కోశాధికారిగా పి.రాంచందర్ ఎన్నికయ్యారు. శుక్రవారం లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320డి అదనపు క్యాబినెట్ సెక్రటరీ ఎం.రాజన్న హాజరై 2025–26 సంవత్సరానికి గాను ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు. లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టి ఖానాపూర్ క్లబ్‌ను జిల్లాలో అగ్రస్థానంలో ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా బాధ్యులు కె. వెంకటేశ్వర్లు, పి.సుదర్శన్, ఎ.సంజీవ్‌రావు ఉన్నారు.

క్లుప్తంగా

గ్రూప్‌-1 ర్యాంకర్‌కు సన్మానం


సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల గ్రూప్‌–1 ఫలితాల్లో 68వ ర్యాంకు సాధించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సతీమణి బరిర ఫరీద్‌ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. బరిరా ఫరీద్ ముమ్ముందు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు ప్రమోషన్ కల్పించాలి


నిరసన తెలుపుతున్న ఆయాలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ ఆయాలుగా ఐదేళ్ల సీనియారిటీ ఉండి ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఆయాల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయాలకు ప్రమోషన్ ఇవ్వకుండానే, ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి టీచర్లకు ట్రాన్స్‌ఫర్ చేయడం సరికాదన్నారు. ఖాళీగా ఉన్న ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, రమ్యశ్రీ , సత్యపాల, సరోజన, లావణ్య పాల్గొన్నారు.

మూడురోజులు కొనుగోళ్లు బంద్


భైంసాటౌన్: పట్టణంలోని ఏఎంసీ మార్కెట్ యార్డులో మూడురోజుల పాటు పంట ఉత్పత్తుల కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపేయనున్నట్టు ఉన్నతశ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న హనుమాన్ జయంతి, 13, 14 తేదీల్లో ప్రభుత్వ సెలవుల నేపథ్యంలో మూడురోజుల పాటు కొనుగోళ్లకు విరామమిచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి


చేతులకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న మైనార్టీల నాయకులు

తానూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని తానూరులో మైనార్టీ నాయకులు చేతులకు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. మైనార్టీ నాయకులు రఫీక్ ఖాన్, అక్బర్‌ఖాన్, షన్వాజ్‌ఖాన్, అబ్దుల్ రెహమాన్, అహ్మద్‌ఖాన్, ముస్లిం మతపెద్దలు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

మామడ: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ అంశాలపై సమీక్షించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

కుంటాల: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల13 హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఎస్టీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాదాస్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.